

నిధుల కోసం నిరీక్షణ

పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను కూటమి ప్రభుత్వం దారి మళ్లించింది. పంచాయతీ ఖాతాలకు జమ చేయకుండా మోసం చేస్తోంది. -8లో



వైఎస్ జగన్‌ను ప్రజల్లోకి వెళ్లకుండా కుట్రలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రజల్లోకి వెళ్లకుండా కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోందని అంజద్‌బాషా ఆరోపించారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/26.4

జిల్లాలో బుధవారం 26.4 - 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు మంత్రి సవిత రాక

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత గురువారం కడపకు రానున్నారు. జిల్లాలో రెండు రోజులు పర్యటించనున్నారు. గురువారం ఉదయం 11.30 గంటలకు పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు జమ్మలమడుగుకు చేరుకుంటారు. ఆగస్టు 1న జమ్మలమడుగులో సీఎం చంద్రబాబునాయుడు పర్యటన నిమిత్తం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించనున్నారు. రాత్రికి కడపలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ చేరుకుని బస చేస్తారు. శనివారం జమ్మలమడుగులో జరగబోయే సీఎం చంద్రబాబు నాయుడు కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

2 నుంచి జమ్మలమడుగులో స్టాపింగ్

జమ్మలమడుగు: గుంటూరు–తిరుపతికి వెళ్లే రైలు ఆగస్టు 2 నుంచి జమ్మలమడుగులో స్టాపింగ్ ఉంటుందని రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల రైల్వే శాఖ ఉన్నతాధికారులు వచ్చినప్పుడు ఇక్కడి ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట, దాల్మియా పరిశ్రమల గురించి వివరించామని.., ఈ ప్రాంతం నుంచి గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు చదువుకునేవారి సంఖ్య ఎక్కువగా ఉందని జమ్మలమడుగులో ఈ రైలుకు స్టాపింగ్ ఇవ్వాలని కోరామన్నారు. దీంతో అధికారులు ఈనెల 2వతేది నుంచి రైలు నిలుపుతున్నట్లు ఉత్తర్వులను విడుదల చేశారన్నారు. అదేవిధంగా ధర్మవరం–మచిలీపట్నం రైలును కొండాపురం స్టాపింగ్ ఉంటుందని వివరించారు.

'ఆర్తీ' హోం సంధ్యకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పుచ్చలపల్లి సంధ్య

కడప సెవెన్‌రోడ్స్: కడప నగరంలోని ఆర్తీ హోం వ్యవస్థాపక అధ్యక్షురాలు పుచ్చలపల్లి సంధ్యకు 'ఫ్యూచర్ ఫీమేల్ ఫార్వర్డ్' పురస్కారం లభించింది. సీఎన్‌బీసీ 18 మీడియా ఛానల్, హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకు సంయుక్తాధ్వర్యంలో బుధవారం బెంగుళూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమెకు ఈ పురస్కారం అందజేశారు. మహిళాభివృద్ధికి గణనీయమైన కృషి చేస్తున్న వారికి తాము ఈ పురస్కారం అందిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆడపిల్లల్లో విద్య, సేవ, గౌరవం, సామాజిక, నైతిక విలువలను పెంపొందించేందుకు ఆమె కృషి చేస్తున్నారని కొనియాడారు.

మస్జిద్ ఏ హంజా ట్రస్ట్‌కు విరాళం



మసీదు అభివృద్ధికి రూ.2లక్షల విరాళం అందిస్తున్న సుభాన్‌బాషా సోదరుడు సుల్తాన్ బాబా

కడప కార్పొరేషన్: వికాస్ విద్యాసంస్థల అధినేత, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుభాన్ బాషా పుట్టినరోజు వేడుకలు కడపలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నగరంలోని మస్జిద్ ఏ హంజా ట్రస్ట్‌కు సుభాన్ భాష సోదరుడు సుల్తాన్ బాబా రూ. 2 లక్షల విరాళాన్ని అందజేశారు. బుధవారం మస్జిద్ ప్రతినిధులకు సంబధిత చెక్కును అందజేశారు. జిల్లా పరిషత్ ఆవరణంలోని ప్రేమాలయ అనాథ శరణాలయానికి పదివేల రూపాయలు అందజేశారు. అనంతరం అన్నదానం చేసి కేక్ కట్ చేశారు. నేతలు షఫీ, షంషీర్,అక్బర్ పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ ఎస్టీ హబ్ అధికారి ఎస్.సురేష్

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ అధికారి ఎస్.సురేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ, జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ సంయుక్తాధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యకమం నిర్వహించారు. ఈ సందర్భంగా హబ్ అధికారి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ యూనిట్లను రీఎంబర్స్‌మెంట్ పథకాలలో నమోదు చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు పారిశ్రామిక సంస్థలు ముందుకు రావాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్దన్, పరిశ్రమలశాఖ జీఎం చాంద్‌బాషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

ఈ కేఎంసీకి ఏమైంది!

- మసకబారుతున్న కేఎంసీ ప్రతిష్ట
- రోజుకో వివాదం.. పూటకో ఆరోపణ!
- తాజాగా యూజర్ చార్జీల అవినీతి బట్టబయలు
- అర్హత లేని వ్యక్తిని కమిషనర్‌గా అందలం ఎక్కించడం వల్లేనని ఆరోపణలు





కడప కార్పొరేషన్ కార్యాలయం (ఇన్‌సెట్) కమిషనర్ మనోజ్ రెడ్డి

కడప కార్పొరేషన్: కడప మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) ప్రతిష్ట మసకబారుతోందా... పాలన పూర్తిగా గాడి తప్పిందా.. అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఈ పరిస్థితి మరింత దిగజారినట్లు స్పష్టమవుతోంది. వరుస వివాదాలు, ఆరోపణలతో కడప కార్పొరేషన్ హాట్ టాపిక్‌గా మారింది.

- పురపాలన చేయడం అంత సులువు కాదు... నిత్యం ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి, ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ వారి సలహాలు, సూచనలతో నగరాభివృద్ధికి పాటుపడాలి. సంస్థ ఆస్తులను, ఆదాయాలను పరిరక్షించాలి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేసిన వారికే ఇది బాగా తెలుస్తుంది. ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులకు ఇన్ని బాధ్యతలు, ప్రజలతో ఇంత దగ్గరగా ఉండి విధులు నిర్వహించడం ఉండదు. ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న అధికారి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి...ఆయన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌ను అవగాహన చేసుకోలేకపోవడం వల్లే ఈ వివాదాలన్నీ వస్తున్నాయని తెలుస్తోంది.

లెక్కలేనితనంతో చిక్కులు

కూటమి ప్రభుత్వం వచ్చాక కార్పొరేషన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశాల్లో ఒక్కటి మాత్రమే సవ్యంగా సాగింది. ఆ తర్వాత నిర్వహించిన రెండు సర్వసభ్య సమావేశాల్లో ఎమ్మెల్యే మాధవికి మేయర్ సురేష్ బాబుతో సమానంగా కుర్చీ వేయలేదని రగడ జరిగింది. నగర ప్రథమ పౌరుడైన మేయర్ ఆదేశాలను పాటించాల్సిన కమిషనర్....ఆయనకు మాటమాత్రమైనా తెలుపకుండా రాజకీయ ఒత్తిడికి తలొగ్గి చట్టాన్ని పూర్తిగా చేతుల్లోకి తీసుకున్నారు. సర్వసభ్య సమావేశం జరిగే వరకూ కాన్ఫరెన్స్ హాల్‌కు తాళాలు వేసి ఉంచడం.. మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కాన్ఫరెన్స్ హాలు ఎదుట సర్వసభ్య సమావేశం నిర్వహిస్తే హాజరుకాకపోవడం ఇందులో భాగమే. పైగా మేయర్, మెజార్టీ కార్పొరేటర్లు నిర్వహించిన సమావేశానికి చట్టబద్ధత లేదని వాదిస్తూ కమిషనర్ తన పరిధిని అతిక్రమించి మేయర్‌కే నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. వాటిని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇటీవల కొట్టేసింది. కార్పొరేషన్ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మేయర్, కార్పొరేటర్లను ఆహ్వానించకుండా ఎమ్మెల్యే మాధవితో శంకుస్థాపన చేయించడం కూడా వివాదాస్పదమైంది. ఇలా వరుస చర్యలతో నగర పాలక అధికారులు పాలకపక్షాన్ని అవమానించారని ప్రజలు భావిస్తున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్‌కు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారా....

ఐఏఎస్ అధికారులు లేదా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో బాగా అనుభవం ఉన్న కమిషనర్లు ఉండాల్సిన కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని నియమించడం వల్లే సమస్యలు వస్తున్నట్లు స్పష్టమవుతోంది. జీవో నంబర్ 679 ప్రకారం చూస్తే డిప్యూటీ కలెక్టర్ స్థాయి అర్హత కలిగిన కడప కమిషనర్‌కు గ్రేడ్–1 మున్సిపాలిటీలైన రాయచోటి, బాపట్ల, చీరాల, కావలి, తాడిగడప, అమలాపురం, అద్దంకి,పార్వతీపురం మున్సిపాలిటీల్లో మాత్రమే కమిషనర్‌గా చేయడానికి అర్హత ఉందని స్పష్టమవుతుంది. సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ అయిన ప్రొద్దుటూరులో కూడా కమిషనర్‌గా పని చేయడానికి ఆయనకు అర్హత లేదని తెలుస్తోంది. అలాంటిది అతిపెద్దదైన కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా నియమించడం వెనుక మతలబేంటో. తమ మాట జవదాటడనే ఏకైక కారణంతో స్థాయి లేని అధికారిని తీసుకు రావడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని మున్సిపల్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

డిప్యూటీ కలెక్టర్ల స్థాయి గ్రేడ్-1 మున్సిపాలిటీల వరకే

ఇతర ప్రభుత్వ శాఖల నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో కమిషనర్‌లుగా రావాలంటే ఏయే అధికారులకు అర్హత ఉందనే అంశంపై ఏపీ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ లేవనెత్తిన అంశాల ఆధారంగా జూలై 15వ తేది మున్సిపల్ శాఖ స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూలో డిప్యూటీ కలెక్టర్ స్థాయి ఉన్న అధికారులు ఇకపై గ్రేడ్–1 మున్సిపాలిటీలకు మాత్రమే కమిషనర్లుగా పనిచేయాల్సి తేల్చి చెప్పింది. తమ మాతృశాఖ నుంచి మారి వేరే డిపార్ట్‌మెంట్‌లో పనిచేయాలనుకుంటున్న వివిధ శాఖల అధికారులకు వారి హోదాను బట్టి ఏ స్థాయి మున్సిపాలిటీల్లో పనిచేయడానికి అర్హత ఉందో అందులో స్పష్టంగా జీవోలో పేర్కొంది. మున్సిపల్ కమిషనర్లుగా వచ్చేవారికి తగిన అర్హత ఉండాలని, పురపాలక సంఘాలను నిర్వహించగల డిపార్ట్‌మెంటల్ నాలెడ్జ్, పౌరులకు అందించాల్సిన ప్రాథమిక సేవలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా ఇతర శాఖల నుంచి మున్సిపల్ కమిషనర్లుగా డిప్యూటేషన్‌పై వచ్చేముందు ఏపీ సీడీఎంఏ, డీటీసీపీ, పబ్లిక్ హెల్త్, టిడ్కో, ఏపీజీబీసీ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, మెప్మా, యూఎల్‌బీలలో 30 రోజులు శిక్షణ చేయాలని ఆ జీవోలో పేర్కొన్నారు.

అవినీతి జరిగిందెంత...రికవరీ చేసిందెంత



ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు కార్పొరేషన్ ప్రతిష్టను మరింత మసకబారేలా చేశాయని పలువురు భావిస్తున్నారు. చెత్త పన్ను(యూజర్ చార్జీలు) వసూలు చేసి కొందరు అధికారులు సస్పెండ్ అయ్యారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌ను మాతృశాఖకు సరెండర్ చేశారు. ఇందులో అవినీతి జరిగింది ఎంత, రికవరీకి తీసుకునే చర్యలు ఏంటి అనే ప్రశ్నలకు సమాధానం లేకుండా పోయింది. దీంతోపాటు కమిషనర్ బంగళాలోనే సిబ్బంది పేకాట ఆడుతూ కెమెరాలకు చిక్కారు. ఇలా కేఎంసీ పేరు నిత్యం వార్తల్లోకి ఎక్కుతూ ఉంది. మొదట్లో తెల్లవారుజామునే అన్ని వార్డుల్లో పర్యవేక్షణ చేసిన కమిషనర్... కొన్ని మాసాలుగా పర్యవేక్షణకు పూర్తిగా పక్కన బెట్టేసినట్లు తెలుస్తోంది. కార్యాలయం నుంచి అడుగు తీసి బయట పెట్టకుండా బంగళాకే పరిమితమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. పోనీ కార్యాలయంలో ఫైళ్లనైనా త్వరగా క్లియర్ చేస్తున్నారా అంటే అదీ లేదు. ఆయన సంతకాల కోసం మాసాల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. మొత్తం మీద ఆయన మున్సిపల్ కమిషనర్‌లా కాకుండా ఆర్డీఓ, డిప్యూటీ కలెక్టర్ మాదిరే వ్యవహరిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు.

చెత్త డబ్బులో ఎవరి వాటా ఎంతో తేల్చండి

- కమిషనర్‌కు వైఎస్సార్‌టీయూసీ వినతి

కడప కార్పొరేషన్: కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్ అధికారులు అనధికారికంగా చెత్త పన్ను వసూలు చేసి లక్షల్లో వెనకేసుకున్నారని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జాషువా, అధికార ప్రతినిధి సుదర్శన్ రాయల్ ఆరోపించారు. బుధవారం కడప కమిషనర్ మనోజ్‌రెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. వ్యాపార సముదాయాల నుంచి మునిసిపల్ కార్పొరేషన్ పేరిట రసీదు బుక్కులను ము ద్రించి నెలకు దాదాపు రూ. 50 లక్షలకు పైబడి వసూలు చేసినట్లు తెలుస్తోందన్నారు. కొన్ని నెలలు గా అక్రమంగా చెత్త పన్ను వసూలు చేస్తుంటే కమిషనర్ గా మీరు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వైఎస్ఆర్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రావు, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మియా, మధుసూధన్ రెడ్డి, రాజ, శ్రీధర్ పాల్గొన్నారు.



కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

చెత్త పన్ను వసూళ్లలో అవినీతి నిగ్గుతేల్చండి

- నరెండర్ చేసి సరిపెడితే సహించం
- అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి రికవరీ చేయాలి
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు

కడప కార్పొరేషన్: అనధికారికంగా చెత్త పన్ను (యూజర్ చార్జీలు) వసూళ్లలో ఎంత అవినీతి జరిగిందో నిగ్గు తేల్చాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. బుధవారం మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో కార్పొరేటర్లు మల్లికార్జున, షఫీ, షంషీర్, డివిజన్ ఇన్‌చార్జులు బసవరాజు, రామకృష్ణారెడ్డి, ఐస్‌క్రీం రవి, సుబ్బరాయుడు, అక్బర్ తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించారు. చెత్త పన్ను వసూలు చేయవద్దని కూటమి ప్రభుత్వం చెప్పినప్పటికీ కొందరు హాస్పిటల్స్,హోటళ్లు, రెస్టారెంట్లు, అపార్ట్‌మెంట్లు, షాపుల నుంచి అనధికారికంగా యూజర్ చార్జీల వసూలు చేశారని, ఇందులో రూ.8కోట్ల వరకూ అవినీతి జరిగిందని తెలుస్తోందన్నారు. వాటాల పంపకంలో తేడాల వల్లే ఇది బయటికి వచ్చిందన్నారు. కార్పొరేషన్‌లో ఇంత అవినీతి జరుగుతుంటే కమిషనర్ నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారులు కమిషనర్లుగా ఉండాల్సిన కార్పొరేషన్‌లో గ్రూప్–1 అధికారిని తేవడం వల్లే పాలన అస్తవ్యస్తమైందని ధ్వజమెత్తారు. చెత్త పన్నులు వసూలు చేయడం ద్వారా అంతిమంగా ఎవరికి లబ్ధి చేకూరిందనేది తేల్చాలన్నారు. ఇతర శాఖల అధికారులతో దీనిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. మేస్త్రీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసి సరిపెడితే సహించేది లేదన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి అవినీతి చేసిన సొమ్మును రికవరీ చేయాలన్నారు. లేనిపక్షంలో కమిషనర్‌కు కూడా ఇందులో భాగస్వామ్యం ఉందని భావించాల్సి ఉంటుందన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య రాజకీయ స్పర్థలు రావడంతో నగరపాలక అధికారులు పాలకపక్షాన్ని పక్కనబెట్టి ఎవరికి వారు సొంత నిర్ణయాలు తీసుకొని పనిచేస్తున్న సంస్థకే కన్నం వేశారని ధ్వజమెత్తారు. దీనిపై సమగ్ర విచారణ చేసి వాస్తవాలు నిగ్గు తేల్చే వరకూ వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

పెద్దచెప్పలి ఘటన దురదృష్టకరం: డీఈఓ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కమలాపురం: పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఓబుళరెడ్డి మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ఘటన దురదృష్టకరం అని డీఈఓ షంషుద్దీన్ అన్నారు. ఈ ఘటనపై స్పందించిన కలెక్టర్ శ్రీధర్ హెచ్ఎంను సస్పెండ్ చేయడంతో పాటు డీఈఓను విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు బుధవారం డీఈఓ పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్‌కు వచ్చి విచారణ చేపట్టారు. హెచ్ఎం ప్రవర్తన గురించి పాఠశాలలోని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ మీడియా సమావేశంలో మాట్లాడారు.పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పే వారే ఇలా మద్యం తాగి పాఠశాల రావడం తప్పు అన్నారు. చేసిన తప్పు హెచ్ఎం ఒప్పుకున్నారన్నారు. ఉపాధ్యాయులు సైతం పలుమార్లు హెచ్ఎంను ఇలా చేయడం సరికాదని చెప్పినప్పటికి ఆయన పద్ధతి మార్చుకోక పోవడం బాధాకరం అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

భద్రత మధ్య టెండర్ల పరిశీలన

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని 13 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే టెండర్ల పరిశీలన బుధవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడు సమక్షంలో జరిగింది. ఇటీవల నిర్వహించిన టెండర్లలో కొంతమంది ఘర్షణకు దిగడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసు భద్రత మధ్య మళ్లీ టెండర్లు నిర్వహించారు. మొత్తం 271 దరఖాస్తులకుగాను 219 టెండర్లు దాఖలయ్యాయి. వీటిని పరిశీలించారు. గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ ఉదయశ్రీ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకుందాం



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

- జెడ్పీటీసీ అభ్యర్థి ఎంపికపై నాయకులు, కార్యకర్తలతో ఎంపీ సమావేశం
- మహేశ్వరరెడ్డి కుటుంబానికి టికెట్ కేటాయించాలని ఏకాభిప్రాయం

పులివెందుల: రాబోయే జెడ్పీటీసీ ఉప ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో పులివెందుల మండలానికి సంబంధించిన కొత్తపల్లె, కణంపల్లె, అచ్చవెల్లి, ఎర్రిపల్లె, రాగిమానుపల్లె, నల్లపురెడ్డిపల్లె పంచాయతీలకు సంబంధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి రెండేళ్ల క్రితం వారి గ్రామంలో జరిగిన దైవకార్యక్రమమైన సిరి బండి ప్రమాదంలో మృతిచెందిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న మహేశ్వరరెడ్డి అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. తాజా ఉప ఎన్నికలలో మీ అందరి అభిప్రాయాల మేరకు అభ్యర్థిని ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థిని ఎంపిక చేసుకున్న తరువాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి ప్రతి ఒక్కరు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా గ్రామాల్లోకి వెళ్లినప్పుడు మన ప్రభుత్వం ఐదేళ్లలో వలంటరీ, సచివాలయ వ్యవస్థద్వారా ప్రజలకు ఎలాంటి మేలు చేశామో.. ప్రజలకు ఏవిధంగా పథకాలు అందాయో వివరించాలన్నారు. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వాటిని ఏవిధంగా అమలు చేయలేదో లోపాలను వివరిస్తూ ముందుకు సాగుదామన్నారు.

మహేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులకు టికెట్

ఆర్ తుమ్మలపల్లె గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి అకాల మరణంతో సంభవించిన ఉప ఎన్నికల్లో మహేశ్వరరెడ్డి కుటుంబానికే టికెట్ కేటాయించాలని బుధవారం జరిగిన సమావేశంలో పార్టీకి సంబంధించిన నాయకులు, కార్యకర్తలు ఏకాభిప్రాయానికి వచ్చి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కోరారు. మహేశ్వరరెడ్డి సతీమణికి గాని, కుమారునికి గానీ టికెట్ కేటాయిస్తామని ఎంపీ వెల్లడించారు.

మహేశ్వరరెడ్డి కుటుంబాన్ని ఆదరించండి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : దివంగత మహేశ్వరరెడ్డి కుటుంబాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికకు బుధవారం నుంచి నామినేషన్ ప్రక్రియకూడా మొదలైందన్నారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయాలమేరకు మహేశ్వరరెడ్డి సతీమణితో గాని, కుమారునితో గాని నామినేషన్ వేయించనున్నట్లు ఎంపీ వెల్లడించారు. మానవీయ కోణంలో ఆలోచించి ఈ ఎన్నికలు సజావుగా జరిగేందుకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని.. మహేశ్వరరెడ్డి కుటుంబం నుంచి నిలబడే అభ్యర్థికి గొప్ప మెజారిటీతో గెలిచేందుకు పులివెందుల మండల ప్రజలందరూ సహకరించాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో మహేశ్వరరెడ్డి సతీమణి ఉమాదేవి, కుమారుడు హరినాథరెడ్డి, రాగిమానుపల్లె సర్పంచ్ అనూష మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే నిర్వహణకు సన్నాహాలు

- 295 గ్రామాల సరిహద్దుల నిర్ణయం
- భూమి రికార్డుల స్వచ్ఛీకరణ
- సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారి మురళీకృష్ణ



సాక్షి ఇంటర్వ్యూ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో భూముల రీ సర్వే నిర్వహణకు అవసరమైన సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్లు, 36 మండలాలు, 735 రెవెన్యూ గ్రామాల్లో 22,36,454 ఎకరాల విస్తీర్ణం ఉందన్నారు. రీ సర్వే ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 320 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి పదమూడవ నోటిఫికేషన్ జారీ చేశామని పేర్కొన్నారు. ఫేస్–2లోని మిగతా 34 గ్రామాలను ఏపీ సర్వే ప్రాజెక్టు కింద చేపట్టామని వివరించారు. మండలానికి ఒక గ్రామం చొప్పున ఈ కార్యక్రమం సాగుతోందని తెలిపారు. ఇక 295 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాల్సి ఉందని వెల్లడించారు. ఈ గ్రామాలకు సంబంధించిన సరిహద్దులను నిర్ధారిస్తామన్నారు.

తొలుత ప్రభుత్వ భూములు..

భూమి రికార్డుల స్వచ్ఛీకరణ కార్యక్రమం కూడా పూర్తయిన తర్వాత తొలుత కాలువలు, వంకలు, వాగులు, గ్రామ కంఠాలు, స్మశానాలు, రస్తా పోరంబోకులు తదితర ప్రభుత్వ భూములను మాత్రం సర్వే నిర్వహిస్తామని, నవంబరు 30వ తేది నాటికి ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్నది లక్ష్యమన్నారు. ఆ తర్వాత ప్రైవేటు భూముల సర్వేను చేపట్టి 2027 నాటికి మొత్తం సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రీ సర్వే నిర్వహణ కోసం 165 రోవర్లు, 420 మంది గ్రామ సర్వేయర్లు, 40 మంది మండల సర్వేయర్లను వినియోగిస్తున్నామని వివరించారు. రీ సర్వేను పర్యవేక్షించేందుకు ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు ఇద్దరు చొప్పున ఉప తనిఖీదారులు ఉంటారన్నారు.

రైతులకు ముందస్తు సమాచారం

రైతులు ఎక్కడున్నా వారికి సమాచారం అందజేసి వారి సమక్షంలోనే వారి భూములకు సర్వే నిర్వహిస్తామన్నారు. ఒకవేళ ఎవరైనా విదేశాల్లో ఉంటే అతని కుటుంబ సభ్యులు, ఏజెంట్ సమక్షంలో రీ సర్వే నిర్వహించి సంబంధిత భూమి యజమానికి వీడియో కాల్ ద్వారా సరిహద్దులు చూపెడతామన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలు అధికంగా రాకుండా చూడాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా వ్యక్తిగత సబ్ డివిజన్లను చేపడతామన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు మండలానికి ఒకరు చొప్పున రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లను నియమించామని, ప్రభుత్వం వీరికి మేజిస్ట్రీరియల్ అధికారాలు కల్పించిందన్నారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ విచారణ నిర్వహించి వారిచ్చిన నివేదికల మేరకు రీ సర్వే నిర్వహిస్తామన్నారు. భూముల రీ సర్వే పారదర్శకంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

క్లుప్తంగా

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొడతాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

సింహాద్రిపురం : స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజా ఉద్యమం తప్పదని వాటిని ఎక్కడ బిగించినా పగులగొడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. బుధవారం ఆయన అంకాలమ్మ గూడూరులో జరిగిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ సంస్కరణలు తానే తెచ్చానని చంకలు గుద్దుకోవడం కాదని ఆ సంస్కరణలు ప్రజలపైన పెను భారాలు మోపుతున్నాయని చెప్పారు. గతంలో విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడంతో ప్రజా తిరుగుబాటుతో ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఆగస్టు 5న జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి వెంకటరాములు, సహాయ కార్యదర్శి కాల్వ బ్రహ్మం, జిల్లా సమితి సభ్యులు ఈశ్వరయ్య, అమీర్, అనిల్, వినయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు

బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లె-తోట్లపల్లె గ్రామాల మధ్యలోని రహదారిలో బుధవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన సుబ్బయ్య కుమారుడు సూరి, ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న ప్రసాద్ కుమారుడు సన్నిలు వేర్వేరు బైక్‌లలో వస్తుండగా ప్రమాదవశాత్తు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇరువురిని 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

నిధుల కోసం నిరీక్షణ

- అందని 15వ ఆర్థిక సంఘం నిధులు
- కేంద్రం ఇచ్చిన పంచాయతీ నిధులను కూటమి ప్రభుత్వం దారి మళ్లింపు
- 7 నెలలుగా పంచాయతీ ఖాతాల్లో జమ కాని నిధులు
- ఫిబ్రవరితో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం
- నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న సర్పంచులు



నరసాపురంలో ఎంపీడీఓ కార్యాలయం

కాశినాయన : పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను కూటమి ప్రభుత్వం దారి మళ్లించింది. కేంద్రం మంజూరు చేసిన ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఖాతాలకు జమ చేయడం లేదు. రెండు విడతలుగా కేంద్రం నుంచి వచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు వినియోగించుకుంటూ పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదు. దీంతో గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం పనులకు ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం వానా కాలం కావడంతో గ్రామాల్లో కాలువల్లో పూడికతీత, బ్లీచింగ్ చల్లించడంతోపాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయడం వంటి పనులకు సైతం నిధులు లేని పరిస్థితి నెలకొందని గ్రామ పంచాయతీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి కడప జిల్లాల్లో 802 గ్రామ పంచాయతీలు

ఉమ్మడి కడప జిల్లాలో 802 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మేజర్, మైనర్ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలకు ఏటా రెండు విడతల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతాయి. సంవత్సరానికి మూడు సార్లు ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అయితే రెండు విడతల్లో 802 గ్రామ పంచాయతీలకు రూ.98 కోట్లకుపైగా జిల్లాకు నిధులు మంజూరవుతాయి. ఈ నిధులను జనాభా ప్రాతిపదికను గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ఏడు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.910 కోట్లపైగా నిధులు మంజూరు చేసింది. ఈ నిధులు నేటికీ గ్రామ పంచాయతీలకు అందలేదు. కేంద్రం మంజూరు చేసిన నిధులను ప్రభుత్వం దారి మళ్లించి కాలయాపన చేస్తోందని సర్పంచ్‌లు వాపోతున్నారు.

పారిశుధ్యం అధ్వానం..

వర్షాకాలం అయినందు వల్ల గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. తాగునీటి బోర్లు రిపేరు చేసేందుకు నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తే గ్రామాల్లో తాగునీటి సమస్యతోపాటు కాలువల్లో పూడికతీత పనులు, తాగునీటి పైపులైన్లు, బోర్ల రిపేరులకు వాడుకుంటారని సర్పంచ్‌లు అంటున్నారు.

ఫిబ్రవరిలో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం

2026 ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోయినా సర్పంచ్‌లు సొంత డబ్బు ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఇంత వరకు బిల్లులు రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎదురు చూపులు

15వ ఆర్థిక సంఘం నిధులు ఎప్పుడు పంచాయతీ ఖాతాల్లో జమ అవుతాయా అని గ్రామ సర్పంచ్‌లు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా రూ.98 కోట్లు మంజూరు కావాల్సి ఉంది. ఇప్పటికే పారిశుధ్యం, తాగునీటి అవసరాల కోసం సర్పంచ్‌లు తమ జేబుల నుంచి డబ్బులు ఖర్చు పెట్టి ప్రజా అవసరాలను తీర్చుతున్నారు. పనులు చేయకపోతే జిల్లా స్థాయి అధికారులు టార్గెట్ చేస్తున్నారని, గత్యంతరం లేక కొందరు సర్పంచ్‌లు, కార్యదర్శులు వడ్డీలకు అప్పులు తెచ్చి ఖర్చు పెడుతున్నారు. ఎప్పుడు నిధులు మంజూరవుతాయో తెలయడం లేదని, వడ్డీలు మాత్రం కట్టాల్సి వస్తోందని కన్నీరు పెడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

సివిల్ మిస్‌లీనియస్ అప్పీల్స్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని సూచనల మేరకు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయ సేవా సదన్‌లో 'సివిల్ మిస్‌లీనియస్ అప్పీల్స్ కేసులు' తదితర అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సివిల్ మిస్‌లీనియస్ అప్పీల్స్ కేసులు, ఉచిత న్యాయ సహాయం, నిరుపేద పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు (సాతి), న్యాయ సలహాలు, గౌరవ జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ పథకాలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆగస్టులో విశేష పూజలు

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయం, దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆగస్టులో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ మేరకు బుధవారం టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఒంటిమిట్ట ఆలయంలో ఆగస్టు 8న ఉదయం వరలక్ష్మి వ్రతం, 9న పౌర్ణమి సందర్భంగా ఉదయం శ్రీ సీతారాముల కల్యాణం, 23 నుంచి 26వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు.

దేవుని కడప శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతం సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సౌభాగ్యం, 9న శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి తిరుమంజనం, 18, 19, 20 తేదీలలో ఆలయంలో బాలాలయం, జీర్ణోద్ధరణ, 24న పుబ్బ నక్షత్రం సందర్భంగా శ్రీ ఆండాళ్ అమ్మవారికి తిరుమంజనం, గ్రామోత్సవం, 25న ఉత్తరా నక్షత్రం సందర్భంగా శ్రీ పద్మావతీ అమ్మవారికి స్నపన తిరుమంజనం, ప్రాకారోత్సవం నిర్వహించనున్నారు.

ఆసక్తికరంగా క్రికెట్ మ్యాచ్‌లు



రుత్విక్ కళ్యాణ్, కర్నూలు (90 పరుగులు)



ఆదినారాయణ, అనంతపురం (118 పరుగులు)

కడప వైఎస్సార్ సర్కిల్ : ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగుతున్నాయి. కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో రెండో రోజు బుధవారం చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య ఆట కొనసాగింది. 44 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 100 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది, ఆ జట్టులోని రుత్విక్ కళ్యాణ్ 90 పరుగులు, రోహిత్ గౌడ్ 32 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని నిహాల్ మాలిక్ 3 వికెట్లు, రక్షణ్ సాయి 2 వికెట్లు తీశారు.

వైఎస్సార్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో...

వైఎస్సార్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో మరో మ్యాచ్ కడప-అనంతపురం జట్ల మధ్య జరుగుతోంది. రెండో రోజు 128 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 53.3 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సయ్యద్ సిరాజుద్దీన్ 51 పరుగులు, జయప్రణవ శాస్త్రి 18 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దేవాన్ష్ 3 వికెట్లు, టి. కిరణ్‌కుమార్ 2 వికెట్లు, సంజయ్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 70 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎ. ఆదినారాయణరెడ్డి 118 పరుగులు, కార్తీక్ 34 పరుగులు చేశారు. కడప జట్టులోని గైబు 3 వికెట్లు తీశారు.

వైఎస్ జగన్‌ను ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న ప్రభుత్వం

- బారికేడ్లు, చెక్‌పోస్టులు పెట్టి ప్రజాభిమానాన్ని అడ్డుకోలేరు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలాగే చేసి ఉంటే బాబు, పవన్, లోకేష్ యాత్రలు చేసేవారా?
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటోందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆరోపించారు. కడపలో బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జడ్‌ప్లస్ కేటగిరి భద్రత ఉందని, కానీ ప్రభుత్వం ఆయన భద్రతను గాలికొదిలేసిందన్నారు. వైఎస్ జగన్ పర్యటనలకు జనాన్ని రాకుండా అడ్డుకునేందుకు వందలాది మంది పోలీసులను వినియోగిస్తున్నారన్నారు. ఈనెల 31వ తేదీ నెల్లూరులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తున్నారని, ఈ పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్దకు పది మంది మాత్రమే రావాలని, జైలులో ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి వద్దకు ముగ్గురికి మాత్రమే అనుమతి ఉందని, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటి వద్ద 100 మందిని మాత్రమే అనుమతిస్తామని పోలీసులు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. అలాగే ఎవరైనా జనసమీకరణ చేసినా, జగన్‌ను చూసేందుకు వచ్చినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడం అన్యాయమన్నారు. గతంలో ఇలాంటి సంస్కృతి ఎప్పుడూ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలాంటి దుష్ట సాంప్రదాయాన్నే కొనసాగించి ఉంటే చంద్రబాబు రాష్ట్రమంతా పర్యటించేవారా...లోకేష్ యువగళం పాదయాత్ర, పవన్‌కళ్యాణ్ వారాహి యాత్ర చేసేవారా అని సూటిగా ప్రశ్నించారు. ప్రజాభిమానాన్ని బారికేడ్లు, చెక్‌పోస్టులు పెట్టి అడ్డుకోలేరని హెచ్చరించారు. ఈ దుష్ట సంప్రదాయానికి ఇకనైనా స్వస్తి పలకాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించే అధికారులు, నాయకుల వివరాలను యాప్ ద్వారా డిజిటల్ లైబ్రరీలో పొందుపరుస్తామని అంజద్‌బాషా తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు నాగయ్య, రమేష్‌రెడ్డి, షఫీ, ఏ1 నాగరాజు, జమీల్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ స్థానాలకు ఐదు నామినేషన్ల దాఖలు



పులివెందుల జెడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న హేమంత్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు నిర్వహించనున్న ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. మొదటిరోజు పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి మూడు, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి రెండు చొప్పున మొత్తం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు.

- ఇందులో పులివెందుల ప్రాదేశిక నియోజకవర్గానికి కాంగ్రెస్ తరఫున తుమ్మలూరు అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా తుమ్మల హేమంత్‌రెడ్డి, తుమ్మల ఉమాదేవిలు నామినేషన్లు రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.
- ఒంటిమిట్ట ప్రాదేశిక నియోజకవర్గానికి జనసేన అభ్యర్థిగా రాటాల రామయ్య, కాంగ్రెస్ అభ్యర్థిగా పూల విజయభాస్కర్ నామినేషన్లు దాఖలు చేశారు.

జాతీయ స్థాయిలో కలికిరి సైనిక పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

కలికిరి : తమిళనాడు రాష్ట్రం అమరావతినగర్ సైనిక పాఠశాలలో ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా సైనిక పాఠశాలల ఆటల పోటీలలో కలికిరి సైనిక పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. అండర్ 17 విభాగం హాకీ జట్టు ఫైనల్‌కు చేరుకుని రన్నరప్‌గా నిలిచినట్లు కలికిరి పాఠశాల ప్రిన్సిపాల్ సీఎస్ పరదేశి తెలిపారు. హాకీ టీం బాలికలను ఆయన అభినందించారు.

అమ్మా నాన్నా.. నన్ను క్షమించండి

– ఫ్యాన్‌కు ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన భరత్ కుమార్

లింగాల : లింగాల మండలం తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎర్ర మేకల భరత్ కుమార్ (23) బుధవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ యువకుడు గత కొన్ని సంవత్సరాల నుంచి కుడి కన్ను సమస్యతో బాధ పడుతుండే వాడు. ఇటీవల కుడి కన్ను పూర్తిగా చూపు కోల్పోయింది. దీనికి తోడు మైగ్రేన్ తలనొప్పి వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు సమాచారం. ×నా చావుకు నేనే కారణం.. ప్రతి రోజు హాస్పిటల్ చుట్టూ తిరగలేకున్నా.. నా ఆరోగ్యం రోజు రోజుకు ఇబ్బందిగా ఉంది.. అమ్మా.. నాన్నా నన్ను క్షమించండి అంటూ మృతుడు భరత్ కుమార్ సూసైడ్ నోట్ రాశాడు. యువకుడి మృతితో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగింది.

ఇంటి గేటు మీద పడటంతో చిన్నారి దుర్మరణం



మృతి చెందిన చిన్నారి అనుశ్రీ

ముద్దనూరు : అవ్వగారింటి వద్ద ఆనందంతో ఆడుతూ పాడుతూ వున్న చిన్నారి కుటుంబంలో ఇంటిగేటు విషాదం నింపింది. మండలంలోని నల్లబల్లె గ్రామంలో ఇంటివద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు ఇంటి గేటు అనుశ్రీ అనే చిన్నారి మీద పడడంతో చిన్నారి దుర్మరణం చెందింది. బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలు మృతురాలి కుటుంబీకుల సమాచారం మేరకు .. తొండూరు మండలం ఊడగండ్ల గ్రామానికి చెందిన రవికుమార్, గాయత్రిల ఆరేళ్ల కూతురు అనుశ్రీ అవ్వగారి గ్రామమైన నల్లబల్లెకు వచ్చింది. అనుశ్రీ ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఇంటి ప్రహరీకి అమర్చిన ఇనుప గేటు అకస్మాత్తుగా చిన్నారిపై పడింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అనుశ్రీని ముద్దనూరులోని ఓ ప్రైవేటు ఆసపత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. అవ్వగారింటికి వచ్చిన చిన్నారి దుర్మరణం చెందడంపై బంధువులలో విషాదం చోటుచేసుకుంది.

మోటారు వైర్లు చోరీ



చోరీకి గురైన మోటారు వైర్లు

వేంపల్లె : పంటలకు నీటి తడులందించేందుకు పొలాల్లోని బోర్లకు అమర్చిన విద్యుత్ సబ్ మెర్సిబుల్ మోటార్ల వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. దీంతో పంటలు సాగు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు. వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లె, వైఎస్ మదీనాపురానికి చెందిన రైతులు నిమ్మ, చీనీ, అరటితో పాటు పలు పంటలను సాగు చేశారు. పొలాల్లో బోర్లను వేసుకొని డ్రిప్ సహాయంతో నీటి తడులను పంటలకు అందించేందుకు సబ్ మెర్సిబుల్ మోటార్లను బిగించుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు రైతులు పంట పొలాల్లో అమర్చుకున్న మోటార్లకు చెందిన వైర్లను మంగళవారం రాత్రి కత్తిరించి ఎత్తుకెళ్లారు. బుధవారం పంటలకు నీటి తడులందించేందుకు పంట పొలాల వద్దకు వెళ్లిన రైతులు వైర్లు కత్తిరించిన విషయం గమనించి లబోదిబో మంటున్నారు. ఒకే రోజు దాదాపు 20 మంది రైతులకు చెందిన మోటారు వైర్లు చోరీకి గురయ్యాయని రైతులు అంటున్నారు. వైఎస్ మదీనా పురం, చింతలమడుగుపల్లెకు చెందిన చిన్న ఖాసీం, పఠాన్ రషీద్, రమేష్, సయ్యద్ ఖాసీం, షేక్.షరీఫ్, పఠాన్ అబ్దుల్ మాలిక్, సయ్యద్ రఫీతోపాటు మరి కొందరి రైతుల పొలాల్లో ఈ చోరీ జరిగింది. పంట పొలాల్లో విద్యుత్ పరికరాల చోరీకి పాల్పడుతున్న దొంగలను పట్టుకోవాలని రైతులు పోలీసులను కోరుతున్నారు.

ఆటో ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : ఆటో ఢీకొని బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. పుంగనూరు మండలం ఈడిగిపల్లికి చెందిన షాంషా బొమ్మల వ్యాపారం కోసం కుమారుడు ప్రవీణ్(15)తో మదనపల్లెకు వచ్చింది. తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లడానికి తమ బంధువులతో కలిసి ఆటోలో బయలుదేరింది. పట్టణ శివారు ప్రాంతమైన పుంగనూరు రోడ్డు మహీంద్రా షోరూం వద్దకు రాగానే, వారు ప్రయాణిస్తున్న ఆటో పక్కకు నిలిపి, ప్రవీణ్ ఆటో దిగి పక్కనే ఉండగా, ఎదురుగా మరో ఆటో వేగంగా వచ్చి బాలుడిని ఢీకొంది. ప్రమాదంలో ప్రవీణ్ తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రేఫర్ చేశారు.

మా భూములు మాకే ఇవ్వాలి

- జాతీయ రహదారిపై దళితుల ఆందోళన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న మడకలవారిపల్లె దళితులు

బద్వేలు అర్బన్ : గత కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములు తమకే ఇవ్వాలని మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లెకు చెందిన దళితులు బుధవారం మడకలవారిపల్లె సమీపంలో నెల్లూరు - ముంబై జాతీయ రహదారి (ఎన్‌హెచ్-67)పై ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళనకారులకు సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. గోపవరం రెవెన్యూ పొలం 1755 సర్వే నెంబరులో ఉన్న జెడ్‌హెచ్‌డీసీ భూములను ఏక్‌సాల్ పర్మిషన్ కింద గత 40 సంవత్సరాలుగా మడకలవారిపల్లెకు చెందిన దళితులు సాగు చేసుకుంటున్నారు. అదే సర్వే నెంబరులో 30 ఎకరాలు కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంఐజీ లేఅవుట్‌కు కేటాయించారు. ఈ మేరకు ప్రభుత్వ అనుమతి కూడా లభించింది. సదరు భూమిని చదును చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్ బుధవారం చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న మడకలవారిపల్లె దళితులు పనులు అడ్డుకునేందుకు ప్రయత్నం చేయగా పోలీసుల సహకారంతో వారిని పంపించివేశారు. అక్కడి నుండి వెనుదిరిగిన దళితులు మడకలవారిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఈ సమయంలో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అలాగే గ్రామానికి చెందిన ఓ దళితుడు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యా యత్నం చేశాడు. ఇంతలో అక్కడికి చేరుకున్న రూరల్ పోలీసులు ఏదైనా సమస్య ఉంటే ఆర్డీఓ కార్యాలయానికి గాని తహసీల్దారు కార్యాలయానికి గాని వెళ్లి విన్నవించుకోవాలని, ఇలా రోడ్లపై వాహనాలను నిలపడం సరికాదని ఆందోళనకారులకు సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో అర్బన్ ఆటో మ్యూటేషన్ ప్రక్రియ

ఆగస్టు నుంచి అమలుకు రంగం సిద్ధం



కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో ఆగస్టు 1వ తేదీ నుంచి నూతన 'అర్బన్ ఆటో మ్యూటేషన్ ప్రక్రియ' అమలు కానుంది. పట్టణ ప్రాంతాల్లో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత మ్యూటేషన్ చేయించుకోవడంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, ఆస్తి యాజమాన్య బదిలీ ప్రక్రియ సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడలోని 4 సబ్ రిజిస్టర్ ఆఫీసుల్లో ప్రయోగాత్మకంగా నిర్వహించి సత్ఫలితాలు సాధించిన మీదట కడప మున్సిపల్ కార్పొరేషన్‌తో సహా మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని 17 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఈ నూతన విధానం అమలు చేయనున్నారు. దీనివల్ల దాన, విక్రయ, పరివర్తన దస్తావేజుల రిజిస్ట్రేషన్ ద్వారా ఆస్తి పూర్తి స్థాయిలో బదలాయింపు అయిన తక్షణం కొనుగోలుదారు పేరిట మ్యూటేషన్ జరిగిపోతుంది. కొత్త అర్బన్ మ్యూటేషన్ ప్రక్రియను ఐజీఆర్ఎస్, (సీడీఎంఏ) ఏపీఐతో ఇంటిగ్రేట్ చేయడం ద్వారా సరళీకృతం చేయడం వల్ల ప్రక్రియ ఆస్తి పన్ను, యాజమాన్య వివరాలను ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబర్(పీటీఐఎన్) ఉపయోగించి సీడీఎంఏ సిస్టమ్‌లో ఇంటిగ్రేట్ చేస్తుంది. సాధారణంగా పురపాలక సంఘాల్లో నిర్వహించే మ్యూటేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి 15-30 రోజులు పడుతుంది. సీడీఎంఏ డేటాబేస్ నుంచి పీటీఐఎన్ ఉపయోగించి ఆస్తి వివరాలను నేరుగా పొందడం ద్వారా మాన్యువల్ విధానం తగ్గుముఖం పట్టే అవకాశముంది. అతి తక్కువ సమయంలోనే బదిలీ అయిన ఆస్తికి పన్ను చెల్లింపు, భవన అనుమతులు, యుటిలిటీ సేవలు పొందడానికి వీలు కలుగుతుంది. ఆటో మ్యూటేషన్ ఫీజు విషయానికి వస్తే ఆస్తి విలువను బట్టి ఆన్‌లైన్ ద్వారా లెక్కిస్తారు. దీనివల్ల మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. ఇతర ఖర్చులు కూడా ఉండవు. (సీడీఎంఏ) ఏపీఐ ఇంటిగ్రేషన్ ద్వారా ఆస్తి వివరాలు, పన్ను బకాయిలు, యాజమాన్య రికార్డులు కచ్చితమైనవిగా ఉంటాయి. మనం పొరపాటున తప్పు డోర్ నంబర్ నమోదు చేసినా సిస్టమ్ తక్షణమే లోపాలను గుర్తిస్తుంది. ఈ విధానానికి ఫోన్ నంబర్‌ను కూడా లింక్ చేయడం వల్ల ఎస్ఎంఎస్ నోటిఫికేషన్లు, ఆన్‌లైన్ స్టేటస్ ట్రాకింగ్ వంటి సదుపాయాల ద్వారా దరఖాస్తుదారులు ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకోవచ్చు.

ఆస్తి సంబంధిత వివాదాలను తగ్గిస్తుంది

నూతన 'అర్బన్ ఆటో మ్యూటేషన్ ప్రక్రియ' ద్వారా ఆస్తి సంబంధిత వివాదాలు తగ్గుతాయి. యాజమాన్య హక్కు, బదిలీలను ఆటోమేట్ చేయడం, పన్ను చెల్లింపులను ఇంటిగ్రేట్ చేసి, ఆన్‌లైన్ సౌలభ్యాన్ని అందిస్తుంది. ఆలస్యం, లోపాలు, పారదర్శకత లోపాలను పరిష్కరిస్తుంది. ఈ ప్రక్రియ పట్టణ ఆస్తి యజమానులు రికార్డులను సమర్థవంతంగా ఆధునీకరించడానికి చట్టపరమైన యాజమాన్యాన్ని సురక్షితం చేయడానికి, సంబంధిత ప్రయోజనాలను పొందడానికి వీలు కల్పిస్తుంది.

– మనోజ్‌రెడ్డి, కమిషనర్, నగరపాలక సంస్థ.